ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 26 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ

అర కొరే..!

ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. రైతుల పరిస్థితి రోజురోజుకూ మరింత దయనీయంగా మారుతోంది. ఒక పక్క కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర లేక సతమతమవుతుంటే మరోపక్క ధాన్యం అమ్మి నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో సొమ్ములు అందకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో రూ.939 కోట్ల ధాన్యం బకాయిలు విడుదల కావాల్సి ఉండగా కేవలం రూ.523 కోట్లు మాత్రమే విడుదల చేశారు. సుమారు రూ.416 కోట్లు విడుదల కావాల్సి ఉంది. రెండు నెలలు పైబడి రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో సొమ్ములు అందించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యాన్ని పట్టుబడి పడుతున్న రైతులు

- ఎట్టకేలకు విడుదలైన ధాన్యం బకాయిలు
- రైతులకు చెల్లించాల్సింది రూ.939 కోట్లు, విడుదలైంది రూ. 523 కోట్లు
- విడుదల కావాల్సింది రూ.416 కోట్లు
- 21 వేల మంది రైతులు సొమ్ము కోసం ఎదురుచూపు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - భీమవరం

దాళ్వా సాగు పూర్తయి మూడు నెలలు గడిచింది. ప్రస్తుతం సార్వా పనులు ప్రారంభమయ్యాయి. అయితే దాళ్వాలో రైతులు అమ్మిన ధాన్యానికి పూర్తిస్థాయిలో సొమ్ములు అందకపోవడంతో సార్వా సాగు పనులు చేపట్టే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. అయితే అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వమైనా రైతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్ప వ్యవసాయానికి, రైతుల ఆర్థిక పరిపుష్టికి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. వ్యవసాయంలో ప్రభుత్వాలు చేయూతనివ్వకపోవడంతో రైతులు అప్పుచేసి మరీ కష్టపడి సాగుచేసి ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మినా సమయానికి సొమ్ము అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కష్టపడి పండించిన ధాన్యానికి చెల్లించాల్సిన నగదు కోసం రైతులు రెండు నెలలు పైబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఎంత దయనీయ పరిస్థితిలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని సాగులో ముందుకు సాగిన రైతులకు రెండు నెలలకుపైగా చేసిన ఖర్చులకు, కూలీలకు, యంత్రాలకు బకాయిలు చెల్లించలేక, వారికి సమాధానం చెప్పలేక తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించిన రెండు, మూడు వారాల్లోపే నగదు రైతుల ఖాతాలకు జమ చేస్తానన్న గత ప్రభుత్వ హామీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. దీనికితోడు సార్వత్రిక ఎన్నికలు కూడా ముందుకు రావడంతో ధాన్యం సొమ్ముల సంగతి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. రైతులకు ధాన్యం నగదు చెల్లించడంలో ఆలస్యం చేయడంతో కొందరు రైతులు ధాన్యం నగదు అందక ఇంటి నిర్మాణాలు నిలిపివేశారు. మరికొందరు ఖర్చుతో కూడుకున్న కార్యక్రమాలను కూడా వాయిదా వేసుకున్నారు. సాగులో అవసరమైన యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు వంటివి కూడా కొనుగోలు చేయలేక నిరుత్సాహపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అరకొరగా ధాన్యం సొమ్ములు అందించడంతో రైతులకు కొంత ఉపసమనం కలిగింది.

జిల్లాలో సుమారు 2.11 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు రబీ సాగు చేశారు. సుమారు 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా పెట్టుకోగా 6.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం సుమారు కొనుగోలు చేసింది. ఈ ధాన్యానికి సంబంధించి రైతులకు సుమారు రూ.1,400 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది రబీ ధాన్యం సేకరణ మొదలుపెట్టిన నాటి నుంచి ఏప్రిల్ 27వ తేదీ వరకూ కొనుగోలు చేసిన ధాన్యానికి సుమారు రూ.461 కోట్లు రైతులకు చెల్లించారు. ఏప్రిల్ 28 నుంచి ధాన్యాన్ని విక్రయించిన రైతులకు వారి ఖాతాల్లో నగదు జమకాకపోవడంతో ధాన్యం సొమ్ము కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 68 వేల మంది రైతులు రూ.939 కోట్ల ధాన్యం సొమ్ము కోసం రైతులు ఎదురుచూపులు చూశారు. అయితే వారం రోజుల క్రితం కూటమి ప్రభుత్వం అరకొరగా ధాన్యం సొమ్ము విడుదల చేసింది. 47 వేల మంది రైతులకు సంబంధించి రూ.523 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశారు. ఇంకా సుమారు 21 వేల మంది రైతులకు రూ.416 కోట్లు విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ సొమ్ములు ఎప్పుడు విడుదలవుతాయో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు. ఒకపక్క సార్వాసాగు పనులు చేపట్టేందుకు చేతిలో చిల్లి గవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. రైతులకు ధాన్యం సొమ్ములు సకాలంలో అందించాలని సిపిఎంతో పాటు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వినియోగంలోకి ఇసుక రీచ్‌లు

అనుమతులకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు

ఇసుక కమిటీ ఛైర్మన్, కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సాధ్యమైనంత త్వరగా జిల్లాలోని ఇసుక రీచ్‌లను వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని, అప్పటి వరకూ జిల్లా వాసులు సమీపంలోని కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలోని ఇసుక నిల్వ కేంద్రాల నుంచి ఉచిత ఇసుక పొందొచ్చని జిల్లా కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ ఛైర్మన్ చెదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో మూడు ఇసుక కేంద్రాలు భీమవరం, నరసాపురం పట్టణాలకు 50 - 60 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, ఇవి జిల్లాలోని ఐదు మండలాలకు అతి సమీపంలో ఉన్నాయని వివరించారు. నిడదవోలు మండలం పందలపర్రు కేంద్రంలో 52,082, పెరవలి మండలం పెండ్యాల కేంద్రంలో 1,46,249, ఉసులుమర్రులో 33,065 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని పేర్కొన్నారు. కోనసీమ జిల్లాలోని మూడు ఇసుక నిల్వ కేంద్రాలు 15-30 కిలోమీటర్ల దూరంలో, జిల్లాలోని 5 మండలాలకు అతి సమీపంలో ఉన్నాయని పేర్కొన్నారు. రావులపాలెం మండలంలోని రావులపాడు-1 కేంద్రంలో 34,171, రావులపాడు-2లో 82,950, కొత్తపేట కేంద్రంలో 25,897 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లాలోని ఆచంట, పెనుగొండ మండలాల్లోని ఆరు ఇసుక రీచ్‌లు పనిచేయడం లేదని తెలిపారు. వీటికి వివిధ అనుమతులు పొందాల్సి ఉందని తెలిపారు. యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లో ఐదు డి-సిల్టేషన్ పాయింట్లు ఉండగా, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆరు ఇసుక కేంద్రాల్లో ఎటువంటి నిల్వలు లేవని తెలిపారు. రేవుల వద్ద వాహనంలోకి ఇసుక లోడింగ్ ఖర్చు, ప్రయాణ ఖర్చులు, ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన సీనరేజ్, జిఎస్‌టి తదితర ఖర్చులు మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియాలజీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయని, వినియోగదారులు తమ ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలను చూపి ఇసుక పొందొచ్చని పేర్కొన్నారు. వినియోగదారుడి నుంచి డిజిటల్ పేమెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఒక వ్యక్తికి ఒక రోజులో కేవలం 20 టన్నులు మాత్రమే ఇసుక తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుందని తెలిపారు. స్టాక్ పాయింట్ల నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే ఇసుకను పొందడానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగం చేయాలనే ఆశలు ఆవిరి

ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొన్న కారు

ఇంటర్వ్యూకు హైదరాబాద్ వెళ్లి వస్తుండగా మృత్యు ఒడిలోకి

ముగ్గురు మృతి, డ్రైవర్, బాలుడి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ద్వారకాతిరుల, ఉంగుటూరు

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్

ప్రమాదంలో మరణించిన రాచాబత్తుని భాగ్యశ్రీ ఇంజినీరింగ్ చదివింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలని ఎన్నో కలలు కంది. ఇంటర్వ్యూకు వెళ్లి ఉద్యోగానికి ఎంపికైంది. మరికొద్ది రోజుల్లో అపాయింట్మెంట్ ఆర్డర్ వస్తుందని సంతోషంతో కుటుంబ సభ్యులతో తిరిగి ఇంటికి ప్రయాణమైంది. ఇంతలోనే విధి మృత్యు రూపంలో వారిని కబలించింది. తన ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు మృతి చెందగా మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. తల్లి, అమ్మమ్మ మృతదేహాల వద్ద బాలుడిని చూసిన వారంతా కన్నీరుమున్నీరవుతున్నారు.

ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద రాజమండ్రి - గుండుగొలను హైవేపై సోమవారం ఉదయం 5.45 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటెయినర్ లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.

భీమవరానికి చెందిన బొమ్మా నారాయణరావు, బొమ్మా కమలాదేవి (52), తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి శివార్లలోని రాజవోలు గ్రామంలో ఉంటున్న తన కుమార్తె రాచాబత్తుని భాగ్యశ్రీ (28), మనవళ్లు రాచాబత్తుని నాగనితిన్ కుమార్ (4), రాచాబత్తుని శ్రీనాగషణ్ముఖ్‌తో కలిసి నాలుగు రోజుల క్రితం భాగ్యశ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి వీరంతా కారులో రాజవోలు బయలుదేరారు. అయితే నారాయణరావు పని నిమిత్తం విజయవాడలో దిగిపోయారు. మిగిలిన వారు రాజవోలు వస్తుండగా ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద హైవేపై రోడ్డు పక్కన ఆగిఉన్న కంటెయినర్ లారీని కారు బలంగా ఢీకొంది. ఈ క్రమంలో కమలాదేవి (52), భాగ్యశ్రీ (28), నాగ నితిన్‌కుమార్ (4) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నాగషణ్ముక్, డ్రైవర్ దుర్గా వంశీని చికిత్స నిమిత్తం ఆశ్రమ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్ తెలిపారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి పరిశీలించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజల సమస్యల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంయుక్త కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 179 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి జిల్లా కేంద్రానికి వస్తుంటారని, వారి పట్ల తగినంత శ్రద్ధ చూపి వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. కొన్ని శాఖల్లో ఫిర్యాదులు వచ్చినవే మరలా వస్తున్నాయని, అలా కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

రూ.20 వేల కోట్ల భారాన్ని ఉపసంహరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

కేంద్రంలో మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రయివేట్ టెలికాం కంపెనీలు మొబైల్ రీఛార్జ్ ధరలు భారీగా పెంచి ప్రజలపై రూ.20 వేల కోట్ల భారాన్ని మోపాయని, వెంటనే పెంచిన భారాలను ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం రిలయన్స్ మార్ట్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రభుత్వ రంగమైన బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసి అంబానీ కంపెనీ జియోకి దేశ ప్రధాని మోడీ ప్రచారకర్తగా ఉండడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ప్రభుత్వ ప్రయివేట్ టెలికం కంపెనీలు రంగంలోకి రాకముందే దేశంలో మూలమూలకీ విస్తరించిన ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్‌ను కేంద్ర ప్రభుత్వం కావాలని నిర్లక్ష్యం చేసిందన్నారు. బిఎస్ఎన్ఎల్‌కు 4జీ, 5జీ నెట్వర్క్ ఇవ్వనందుకు సుమారు రూ.కోటి మంది కస్టమర్లు ప్రయివేట్ కంపెనీలకు జియోకి తరలి వెళ్లారని తెలిపారు. ఉచిత సిమ్ముల పేరుతో ప్రజలకు నెట్ అలవాటు చేసి ఇప్పుడు వేలకోట్ల రూపాయలు భారాలు వేయటం దారుణమని విమర్శించారు. జియో రూ.20,607 కోట్లలో రూ.7467 కోట్ల నికర లాభాన్ని ఆర్జించాయని, నష్టాల పేరుతో ప్రజలపై భారాలు వేయటం దారుణమని తెలిపారు. ఒకే టాలీ ఫుల్ పెంచి వినియోగదారుల నెత్తిన భారాలు మోపాయని అన్నారు. బిఎస్ఎన్ఎల్ తన సేవలను విస్తరించడానికి, సాంకేతిక శక్తి సామర్థ్యాలను పెంచుకోవడానికి ప్రయత్నించిన ప్రతిసారి మోడీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని తెలిపారు. ఇప్పటికైనా టెలికాం రెగ్యులేటరీ కమిటీ ద్వారా టెలికం ప్రయివేట్ కంపెనీలు పెంచిన రీఛార్జ్ ధరలు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, సిహెచ్.వెంకటేశ్వరరావు, కురిటి సోమేశ్వరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గం

ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యాన రాస్తారోకో

ప్రజాశక్తి - పోడూరు

ధాన్యం డబ్బులు మూడు నెలలైనా ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో పోడూరు మండలం కవిటం వంతెన వద్ద పాలకొల్లు, మార్టేరు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ సారవ పంట నాట్లు ప్రారంభమైనా, దాళ్వా పంట ధాన్యం అమ్మినా డబ్బులు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడం మంచిదే కానీ, రైతుల కష్టార్జితం రైతులకు ఇవ్వకపోవడం రైతులపట్ల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు. కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు మాట్లాడుతూ పంట చేతికొచ్చిన తర్వాత నెలలు తరబడి ధాన్యం డబ్బులు ఇవ్వకపోవటంతో కౌలురైతులు తెచ్చిన అప్పులకు అక్రమంగా వడ్డీలు కట్టి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇంకా 30 వేలమంది పైడి రైతులకు రూ.420 కోట్లు రావాలని తెలియజేశారు. తక్షణం కౌలు రైతులకు, రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, కౌలురైతులు, రైతు కేతా గోపాలన్, బొంతు శ్రీనివాస్, పిల్లి కామేశ్వరరావు, కవురు శ్రీనివాసు, శీలం నాగశ్వరావు, దొంగ నాగశ్వరావు, తానేటి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల హరిబాబు, పల్లి జార్జిబాబు, ఆకుమర్తి నాగరాజు, బండి శ్రీనివాసు, కొండేటి సత్యనారాయణ, సూరినీడి వెంకటేశ్వరరావు, పిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

7వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి

కలెక్టర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - భీమవరం

ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలోని ఏడవ వార్డులో మారుతీ నగర్ డ్రెయినేజీ వరకు డ్రెయిన్ నిర్మాణం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బొక్క సత్యనారాయణ, పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ డ్రెయినేజీ నిర్మాణం చేయాలని అనేక ఏళ్లగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. డ్రెయినేజీ లేకపోవడం వల్ల వాడకం నీరు, వర్షపు నీరు వెళ్లే మార్గము లేక రోడ్డుమీద నిలిచిపోతుందన్నారు. దీంతో దోమలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ అనారోగ్యానికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్థానిక ఎంఎల్ఎకు డ్రెయినేజీ నిర్మాణం చేయాలని విన్నవించుకున్నా పరిష్కారం కాలేదన్నారు. డ్రెయినేజీ నిర్మాణం చేయాలని అనేకసార్లు సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన పోరాటం చేశారని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వెంటనే డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేసి, ప్రజల ఆరోగ్యాన్ని దోమల నుంచి కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చలపోయిన వెంకటేశ్వరరావు, గాది రాజు సూర్యనారాయణ రాజు, పి.వెంకటేశ్వరరావు, టి.సత్యనారాయణ, జామిరమేష్, కొట్టాడు వెంకటరమణ, కొట్టాడు రమేష్, కొట్టాడు యేసు రత్నం, కొట్టాడ ఏసు, బి.శాంతకుమారి, కొట్టాడా త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఇసుక విధానం అమలుకు పటిష్ట చర్యలు

జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. సోమవారం నరసాపురం ఆర్‌డిఒ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో ప్రజలకు ఉచితంగా ఇసుకను సరఫరా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, సంబంధిత అధికారులు, బోట్స్ మెన్ సొసైటీలతో జిల్లా జాయింటు కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ చట్టబద్ధమైన పన్నులు, లెవీలతో పాటు కార్యకలాపాల ఖర్చు మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చెయ్యాలన్నారు. వినియోగదారులు సంతృప్తి చెందాలి, ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని తెలిపారు. ప్రజా ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలుచేసేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. నరసాపురం, అబ్బిరాజు పాలెం, దొడ్డిపట్ల, యలమంచిలి, చించినాడలో ఉన్న పాయింట్లులలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అనుమతులు యుద్ధ ప్రాతిపదికన పొందాలన్నారు. కొత్తగా గోదావరిలో డీసిల్టింగ్ పాయింట్లను సంబంధిత అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించాలన్నారు. జిల్లాలోని వివిధ ఇసుక స్టాక్ పాయింట్లలో నిల్వలు, ఉచిత విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జవాబుదారీ తనంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేయాలని నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చట్టబద్ధమైన పన్నులు, లెవీలతో పాటు కార్యకలాపాల ఖర్చు మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేయబడుతుందన్నారు. ఒక సొసైటీకి ఎన్ని బోట్లు ఉన్నాయి, ఎంతమంది సిబ్బంది ఉంటారు, ఒక బోటు ద్వారా రోజుకి ఎంత ఇసుకను తీసుకురావచ్చును, తదితర వివరాలను జిల్లా జాయింటు కలెక్టర్ ఆరా తీశారు. ఇసుక నిల్వ కేంద్రాల వద్ద నామమాత్రపు రుసుం వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉచిత ఇసుక విధానాన్ని మైన్స్ అండ్ జియాలజీ, రెవెన్యూ, రవాణా, పోలీసు తదితర శాఖల అధికారులు పటిష్ట అమలుకు కృషి చేయాలన్నారు. ఇందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని తెలిపారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని, పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ స్టాక్ పాయింట్ వద్ద డిప్యూటీ తహాశీల్దార్ స్థాయి అధికారిని పర్యవేక్షణకు ఉంచాలని, అనధికారికంగా ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. బోట్ మేన్ సొసైటీలు కొన్ని ఇబ్బందులను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి జి.జయ ప్రసాద్, కన్జర్వేన్సీ సహాయ సంచాలకులు కెవి.సుబ్బారావు, నరసాపురం, పెనుగొండ ఆచంట, యలమంచిలి తహాశీల్దార్లు, సంబంధిత అధికారులు, బోట్స్ మెన్ సొసైటీలు, ప్రెసిడెంట్లు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

బాల్య వివాహాలను అరికట్టాలి

కలెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో బాల్య వివాహాలు ఎట్టి పరిస్థితుల్లో జరగడానికి వీలులేదని, బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో మాత్రమే ఉంచాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై ఆ శాఖలో అమలు జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చదువు ప్రయోజనాలు, వారి భవిష్యత్ అన్ని అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో బాల కార్మికులు కూడా ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదన్నారు. పని ప్రదేశాల్లో తరచూ తనిఖీలు చేయడంతో పాటు, సంబంధిత యజమానులపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తనిఖీల్లో ఎవరైనా పిల్లలు పట్టుపడితే పాఠశాలలో చేర్పించి, బడికి సక్రంగా వెళుతున్నది లేనిది తరచూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణ పక్కాగా ఉండాలని, పిల్లలకు, తల్లులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, సిడిపిఒలు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆర్.రాజేష్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, పివి ప్రతాప్

ప్రజాశక్తి - తణుకు

ఈనెల 21, 22, 23 తేదీల్లో తణుకులో జరిగే సిపిఎం జిల్లా స్థాయి సమావేశాలు జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు, పివి ప్రతాప్‌లు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశం బళ్ల చినవీరభద్రం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాబురావు, ప్రతాప్‌లు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి 3 రోజుల పాటు సమావేశాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి 20 మంది ప్రతినిధులు వస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చిత్తశుద్ధితో చేయాలన్నారు. ఎపికి ప్రత్యేక హోదా కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాల నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, గణేష్, గోపి, సత్యనారాయణ, ఎన్.కరుణకుమార్, ఎన్.యేసు, అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

జెసిబితో మట్టి తొలగింపు

ప్రజాశక్తి - కాళ్ల

గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కాళ్ల-సూర్యారావుపేటకు వెళ్లే మెటల్ రోడ్డు బురదమయంగా మారింది. ఇటీవల చేపలు, రొయ్యల చెరువులోని నల్ల మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించారు. నల్ల మట్టి రోడ్డుపై జారి పడిపోయాయి. సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా రోడ్డు చిత్తడిగా తయారైంది. దీంతో గ్రామ సర్పంచి భోనం భాగ్యశ్రీ, టిడిపి నాయకుడు భోనం శివకుమార్ ఆధ్వర్యంలో జెసిబితో మట్టిని తొలగించే పనులు సోమవారం చేపట్టారు. దీంతో వాహనదారులు తమ రాకపోకలు సాగించారు.

కేంద్ర మంత్రిని కలిసిన నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్ వర్మను సోమవారం భీమవరంలో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి శ్రీనివాస్ వర్మకు నాయకర్ పుష్పగుచ్ఛం అందించారు. కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్, ఫిషింగ్ హార్బర్, పలు నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం చర్చించినట్లు నాయకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సంతోష్, పి.కిరణ్మయి మాట్లాడుతూ డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత వల్ల దోమల నివారణ అవుతుందని తెలిపారు. డెంగీ నివారణ మాసోత్సవాలు జరుగుతున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు డెంగీ నివారణకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నెలరోజులపాటు డెంగీపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, స్టాఫ్ నర్స్ ఓగిరాల పరిమళ పాల్గొన్నారు.

కళాశాలకు 'బి ప్లస్ ప్లస్' గ్రేడ్

ప్రజాశక్తి - తణుకు

కళాశాల విద్యార్థినులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థినులతో కూడా సమావేశమై, కళాశాలకు 'బి++' గ్రేడ్‌ను బహూకరించారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ వారి స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన నేషనల్ అసెస్మెంట్, ఎక్రిడిటేషన్ మండలి(నాక్) బెంగుళూరు, పీర్ టీమ్ జూన్ నెల 28, 29 రోజుల్లో పర్యటనలో భాగంగా ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ మహేంద్ర శ్రీవాస్తవ, అవదేశ్ ప్రతాప్‌సింగ్ యూనివర్సిటీ, రేవ, మధ్యప్రదేశ్, మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ గౌతమ్ భౌమిక్, గౌరీబంగా యూనివర్సిటీ, వెస్ట్‌బెంగాల్, మెంబర్ ప్రొఫెసర్ ప్రీతనిరేష్, ప్రిన్సిపల్ కెల్విజిడెజ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, కామర్స్ అటానమస్, మహారాష్ట్ర బృందం ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో అన్ని విభాగాలను పరిశీలించిందని, ఈ బృందం పట్టణ ప్రముఖులతో సమావేశమై, కళాశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడుతూ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థినులు, తల్లిదండ్రులు, పురప్రముఖులకు కళాశాల యాజమాన్యం వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

'విద్యార్థుల్లో ఆటల పట్ల ఆసక్తి కలిగించాలి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులకు ఆటల పట్ల ఆసక్తి కలిగించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క పిఇటి, పిడీల మీద ఉందని తణుకు డిఐఇడి డిప్యూటీ డి.మురళీ సత్యనారాయణ అన్నారు. ముప్పైనాలుగు సంవత్సరాలు డ్రిల్ మాస్టర్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన గుడిమెట్ల శ్రీనివాసరెడ్డికి మారుటేరు వేణుగోపాల హైస్కూల్ గ్రౌండ్‌లో స్థానిక ఫ్రెండ్ సర్కిల్ వారు ఘన సన్మానం చేశారు. ఈ సభకి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతీ స్కూల్‌లో విద్యార్థులకు ఆటల పట్ల ఆసక్తి పెంపొందించాలని కోరారు. శ్రీనివాసరెడ్డి ముప్పైనాలుగు సంవత్సరాలుగా ఒక్క రిమార్క్ లేకుండా వర్క్ చేసారని, క్రీడల అభివృద్ధి కోసం తన సొంత నిధులతో స్కూల్స్‌లో అనేక సదుపాయములు కలిగించడం సంతోషించదగ్గ విషయమని కొనియాడారు. హెడ్ మాస్టర్ సిహెచ్ చిన సూర్యనారాయణ రెడ్డి, పిపిఆర్ ట్రస్ట్ అధ్యక్షులు గొలుగురి శ్రీనివాస రెడ్డి, ఎస్‌టియు యుటియు ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చైతన్య చిన్నారులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే ఏం చేయాలి, దాని ఆవశ్యకత, మొక్కలు నాటడం వల్ల ఉపయోగాలు, అవి ప్రకృతికి చేస్తున్న ప్రయోజనాలు విద్యార్థులకు తెలియజేసే కార్యక్రమమే గ్రీన్ ఇండియా మిషన్ అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య ఒలింపియాడ్ పాఠశాలలో చిన్నారులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు పెద్ద ఎత్తున తీసుకువచ్చిన మొక్కలను పాఠశాల ఆవరణలో విద్యార్థుల సమక్షంలో నాటి, నీరు పోసి, వాటి సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ నాగార్జున, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి ఆధ్వర్యంలో సోమవారం ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్, యుఎస్ఎ సంస్థ డాక్టర్ కెవి రావు వారి ఆర్థిక సహకారంతో అత్తిలి మండలం దంతుపల్లి గ్రామానికి చెందిన జుత్తిగ రంగారావుకి రూ.6 వేలు విలువ చేసే వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యురాలు వడ్లమాని పార్వతి, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

శ్రీనివాస్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలి

తూర్పు కాపు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఉండి

తూర్పు కాపులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర శ్రీనివాస్ యాదవ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని తూర్పు కాపు సంఘం నాయకులు సత్యవాడ శ్రీనివాసు, గళావిల్లి ధనుంజయ, కరిమెరక మల్లిఖార్జున, మజ్జి కృష్ణ ప్రసాద్, అంబళ్ల శివనాగ తదితరులు ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఇసుక దొడ్డి ప్రాంతంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన చిన్నపాటి గొడవను పురస్కరించుకుని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర శ్రీనివాస్ యాదవ్ గొడవకు సంబంధం లేని వ్యక్తిపై ప్రధాన ముద్దాయిగా కేసు నమోదు చేయించడం దుర్మార్గమని అన్నారు. వారు ఫిర్యాదు చేసిన అనంతరం శ్రీనివాస్ యాదవ్ స్టేషన్ బయట మాట్లాడుతూ తూర్పు కాపులను ఇంటింటికీ వెళ్లి కొడతానని మాట్లాడటం దారుణమని, అన్నదమ్ముల మాదిరిగా ఉన్న తమ మధ్య కులాలను ఆపాదించి, కుల ఘర్షణలకు దారి తీసే విధంగా మాట్లాడుతున్న శ్రీనివాస్ యాదవ్ తూర్పు కాపులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని వారు ఎస్ఐ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేశారు. మహిళలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు.

సీనియర్ కళాకారుడు షేక్ బాజీశ్రీ మృతి

పాలకొల్లు: ప్రముఖ రంగస్థలం, సినీ, టీవీ జూనియర్ ఆర్టిస్ట్, రిటైర్డ్ వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి, టిడిపి నాయకుడు షేక్ బాజీశ్రీ(85) పాలకొల్లు పట్టణం కొత్తపేటలో తన స్వగృహంలో సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఇరువురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు కళాకారులు, వాణిజ్య పన్నుల ఉద్యోగులు, టిడిపి నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

అధికారులతో ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం జనసేన ఎంఎల్ఎ కార్యాలయంలో సోమవారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విభాగాలు వారీగా ఆయా డిపార్ట్మెంట్ పనితీరుపై నాయకర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిచాలన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం


ఉండిలో నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

మరణం లేని మహనీయుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని నరసాపురం మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాద్ రాజు అన్నారు. కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు వైసిపి కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుతగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును ప్రసాదరాజు కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు.

స్టీమర్ రోడ్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్రసాదరాజు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

ఉండి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉండి బాలాజీరావుపేటలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, సీనియర్ నాయకులు గులిపల్లి అచ్చారావు, బడుగు బాలాజీ, ఏడిద వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూరవరపు వెంకటాచార్యులు, కొర్రపాటి అనిత, రాయి సతీష్, శేషాద్రి శ్రీను, గళావిల్లి ధనుంజయ, నిమ్మల కేశవ కుమార్, బేతాళ పుష్ప, మున్నలూరి శ్రీనివాస్, వర్రే ముసలయ్య పాల్గొన్నారు.

ఆచంట: ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత డాక్టర్ వైఎస్ఆర్ అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా స్థానిక రామేశ్వర స్వామి ఆలయ ఆవరణ ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మనవర్తి విజయ్ కుమార్, వస్కా ఉమేష్, నార్గన శ్రీనివాస్, గోడవర్తి కృష్ణ కుమార్, బాలిన వీరాస్వామి, బండి మహేష్, కరెంట్ వెంకటేశ్వర రావు, పీతల నాగేశ్వరావు, తప్పెట్ల వెంకట్రావు పాల్గొన్నారు.

ఆచంట: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆచంట నియోజకవర్గం వైసిపి మాజీ ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి పోడూరు మండలం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని వైసిపి ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు, వైఎస్ఆర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెనుగొండ: వాడ వాడలా వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి మండల కార్యదర్శి తిక్కిరెడ్డి పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ఎస్‌వికెపి కాలేజీ సెంటర్‌లో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద పవన్ కుమార్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి, ఆయన చేసిన సంక్షేమ కార్యక్రమాల అభివృద్ధి మరవలేనిదని, ప్రజల మనసును గెలిచిన నాయకుడని కొనియాడారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు బాబురావు, శ్రీనివాస్, రెడ్డి కొనుకు శ్రీను, సత్తిరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను మాజీ డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ఘనంగా నిర్వహించారు. సోమవారం పోలీస్ ఐలాండ్ సెంటర్, బస్టాండ్ ప్రాంతాల వద్ద మాజీ డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

మొగల్తూరు: మండలంలోని గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతి వేడుకలను వైసిపి నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు ఉన్నారు.

వీరవాసరం: కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి నౌడూరు సెంటర్ వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కటింగ్, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్‌సి ఛైర్మన్ కోటిపల్లి, మాజీ జెడ్‌పిటిసి మానుకొండ ప్రదీప్, కోడి అప్పారావు పాల్గొన్నారు.

పెనుమంట్ర: గ్రామంలో వైఎస్ఆర్ 75వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వెస్ట్ గోదావరి ఐటీ వింగ్ సెక్రటరి పడాల సతీష్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు తేతలి సుదీర్ రెడ్డి, తమనంపూడి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

పాలకొల్లు: పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో వైఎస్ఆర్ జయంతి సందర్భంగా రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనంద ప్రకాష్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం: పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే దిశగా జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటుకు శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013 (నివారణ, నిషేధము, పరిహారం)పై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, స్థానిక ఫిర్యాదుల కమిటీ నోడల్ అధికారులతో మాట్లాడారు. అవాంఛనీయ చర్యలు, లైంగికత్వంతో కూడిన ప్రవర్తన, ప్రతికూలమైన వాతావరణాన్ని సృష్టించడం ఈ చట్టం స్పష్టమైన నిర్వచనాన్ని అందిస్తుందన్నారు. 2013 మహిళా హక్కుల పరిరక్షణలో భాగంగా పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించడానికి ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ హోమ్‌లు, పరిశ్రమలు, క్రీడా సంస్థలు, హాస్పిటల్స్, సహకార సంస్థలు, విద్యాసంస్థలు, కార్పొరేషన్లు, స్వయం ఉపాధిలు, బ్యాంకులు, మరే ఇతర పనిచేసే చోటనైనా పదిమంది అంత కన్నా ఎక్కువగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు, ఇతర ప్రాంతాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు స్వేచ్ఛగా భద్రత కలిగి ఏదైనా వృత్తి, వ్యాపారం లేదా వ్యాపారాన్ని నిర్వహించడానికి అనువైన వాతావరణం కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. పనిచేసే ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ కింద ఏర్పాటు చేయాలని సూచించారు. న్యాయవాది, కమిటీ సభ్యులు మైలాబత్తుల చిత్ర భాను మాట్లాడుతూ పనిచేసిన ప్రదేశంలో ఏదైనా ఇబ్బంది ఎదుర్కొన్నా వెంటనే సాక్ష్యాధారలతో ఫిర్యాదు చేయాల్సి ఉంటుందన్నారు. కనీసం సంఘటన నాటి నుంచి మూడు నెలల లోపు సాక్ష్యాధారాలతో అందించిన ఫిర్యాదులను మాత్రమే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. పాత సంఘటనలు తెలియజేస్తూ ఇచ్చే ఫిర్యాదులు పరిగణలోనికి రావన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాజేష్ చట్టంపై అవగాహన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చట్టం అవగాహనపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఒ జె.భాస్కరరావు, కమిటీ ఛైర్‌పర్సన్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి బి.సుజాత రాణి, సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పాల్గొన్నారు.

'వైద్యం అందుబాటులోకి తేవడం అభినందనీయం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైద్యం ఖరీదుగా మారిన నేటి తరుణంలో అటువంటి వైద్యం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు మండలం కస్పాపెంటపాడు గ్రామంలో శ్రీ పెంట్లమ్మ వారి ఆలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జితో కలిసి ప్రారంభించి, పెంట్లమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్యం చేయించుకోలేని వారు వైద్య శిబిరం వినియోగించుకోవాలని కోరారు. సర్పంచి పీతల సత్యనారాయణ, ఉప సర్పంచి శివరామకృష్ణ, తెలుగు యువత తాడేపల్లిగూడెం నియోజకవర్గం గంధం సతీష్ పాల్గొన్నారు.

జిల్లాలో 24.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను సోమవారం అధికారులు వెల్లడించారు. పాలకొల్లు 5.2, యలమంచిలి 4.2, నరసాపురం 3.2, గణపవరం 2.4, మొగల్తూరు 2.2, పోడూరు, ఉండి 1.6, పాలకోడెరు, ఆకివీడు 1.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా, జిల్లాలోని మొత్తం 20 మండలాల్లో 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని అధికారులు తెలిపారు. జిల్లా యావరేజ్ వర్షపాతం 1.2 మిల్లీమీటర్లు నమోదైంది.

పేద విద్యార్థులకు బాసటగా నిలవాలి

వాసవీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంతో ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చదువుపై ఆసక్తి ఉండి, చదువుకోలేని స్థితిలో ఉన్న పేద విద్యార్థులకు వాసవి విద్యాసంస్థలు బాసటగా నిలవాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా తనకు ఎవరూ కమిషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదని, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే కార్యక్రమాలకు సహకరిస్తే సరిపోతుందన్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని, త్వరలో మసులమ్మ జాతర వేడుకల నిర్వహణకు సమాయత్తమవుతున్నామన్నారు. వీటితో పాటు మరిన్ని కార్యక్రమాలు మీ ప్రోత్సాహంతో చేసేందుకు చూస్తున్నామని, ఆ కార్యక్రమాలకు తాను కూడా ఒక దాతల వ్యవహరిస్తాను తప్ప అధికారం ఉంది కదా అని సంక్షేమాన్ని విస్మరించే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ రత్నాకర్ రావుతో పాటు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'దళితులపై దాడులు అరికట్టాలి'

ప్రజాశక్తి - భీమవరం

దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని పివి రావు మాల మహానాడు నేతలు సోమవారం కలెక్టర్ నాగరాణిని కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో పివి రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ రావు, ఇతర నేతలు దళిత సమస్యలను కలెక్టర్‌కు వివరించి వినతిని అందజేశారు. జిల్లాలో అనేకచోట్ల భూస్వాములు, దళితులకు సంబందించిన స్మశాన వాటికలను కబ్జాలు చేయటమే కాకుండా అడిగితే దళితులపై దాడులు చేయటం, కొన్నిచోట్ల దళితులు, దళిత మహిళలపై హత్యాయత్నం చేస్తున్నారని చెప్పారు. భీమవరం మండలం వెంప పెదపేటలో దళితులకు సంబంధించిన స్మశానం సుమారు 1.85 సెంట్లు భూస్వామి అయిన కలిదిండి సుబ్బారాజు దౌర్జన్యంగా వారి పొలంలోకి రాత్రికి రాత్రే రోడ్డువేయటమే కాకుండా, సుబ్బారాజుని ప్రశ్నించిన దళితులపై కిరాయి గుండాలతో దాడిచేయించటం జరిగిందన్నారు. వినతిని అందించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

మొగల్తూరు: పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమని రవిశంకర్ సర్కార్ అన్నారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1988-89 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.45 వేలు సమకూర్చి వాటిని ప్రధానోపాధ్యాయులకు అందించారు. పాఠశాల పూర్వ విద్యార్థులైన న్యాయమూర్తి గుబ్బల చంద్ర మౌలేశ్వరీ, రాయుడు చంద్ర శేఖర్, ఆనంత పల్లి కృష్ణలు ఒక్కొక్కరూ రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు అనంతపల్లి కిరణ్, రాజా పండు, కుక్కల శివ శంకర్ ప్రసాద్ రూ.5 వేలు చొప్పున రూ.15 వేలు సమకూర్చారు. ఆ నగదును అనంతపల్లి కృష్ణ, వేంద్ర నాగరాజు, గుండు రామ కుమార్ హెచ్‌ఎంకు అందజేశారు.

'లోకల్ బడ్డీ' హైపర్ లోకల్ సర్వీస్ స్టార్ట్ అప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో లోకల్ బడ్డీ అనే హైపర్ లోకల్ సర్వీస్ స్టార్ట్ అప్‌ను నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ లాంచ్ చేశారు. కళాశాల పూర్వ విద్యార్థిని జ్యోత్స్న ఆలోచనే ఈ లోకల్ బడ్డీ. జ్యోత్స్న 'ఐ యూ థింక్' అనే సంస్థ స్థాపించి, ఇప్పటి వరకూ 300 ఇన్నోవేటర్స్‌కి ప్లాట్‌ఫారం కలిపించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ యువత ఇన్నోవేటివ్‌గా ఆలోచించాలని, స్టార్టప్ ఫార్మ్‌ని సొంతంగా మొదలు పెట్టి ఉద్యోగాలను సృష్టించాలి అన్నారు. ప్రభుత్వ పథకాలు స్టార్టప్ ఇండియా ద్వారా ఫండ్స్‌కి అప్లై చేసి సంస్థలు స్థాపించాలని తెలిపారు. దేశ భవిష్యత్తుకి యువత ఇన్నోవేటివ్ ఆలోచనలు ఎంతో ముఖ్యం అని పేర్కొన్నారు. విద్యార్థులు ఆలోచనలు విని, వాటిని ముందుకు తీసుకు వెళ్లేందుకు సపోర్ట్ చేస్తా అని తెలిపారు. చక్కటి ఆలోచనలకు ఆయన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. లాంచ్ అయిన 'లోకల్ బడ్డీ' ఐడియాలజీ ఎంతో మందికి ఉపయోగకరం అన్నారు. ట్యాబ్లెట్స్, కిరాణా లాంటివి ఇంటి వద్దకే డెలివరీ చేయబడతాయి. లోకల్‌గా ఉన్న ఉత్పత్తులను బయట ఊర్లకి ప్రమోట్ చేయడం అనే ఆలోచన ఇంకా బాగుందని కొనియాడారు. కొత్త తరహా ఆలోచనలకు ఐ యూ థింక్ అనే వేదిక కలిపించిన జ్యోత్స్నకు అభినందనలు తెలియజేశారు. నరసాపురంలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం పూర్తిచేసిన, కెఎల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి వచ్చిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికేట్స్ అందజేశారు. కళాశాల ఛైర్మన్ కెవి సత్యనారయణ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త ఆలోచనలో ముందుకు రావాలని పేర్కొన్నారు. డాక్టర్ చిన్నిమిల్లి సత్యనారాయణ, హుస్సేన్, బొమ్మిడి సునీల్, డైరెక్టర్ శ్రీహరి, ట్రెజరర్ కె.స్వామి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ గోపి చంద్ విద్యార్థునలు ఉద్దేసించి స్టార్టప్స్ మీద అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం, విద్యార్థులతో కలిసి నాయకర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

సంకల్పమే ఆయుధం.. విజయమే లక్ష్యం

నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంకల్పమే ఆయుధంగా, విజయమే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. ఎపి నిట్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్స్పైర్ మనాక్ మెంటర్ షిప్ అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథి డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక వికాసానికి విద్యే కీలకమని తెలిపారు. ప్రతి విద్యార్థి పరిశోధకుడిగా రాణించాలంటే పాఠశాల విద్య నుంచే బలమైన పునాది ఉండాలన్నారు. బట్టీ చదువుల మార్కులు తెచ్చిపెడతాయేగాని విద్యార్థులను మేధావులుగా గుర్తించలేవన్నారు. సృజనాత్మక ఆలోచనలు, కొత్త కొత్త ఆవిష్కరణలు, ప్రాజెక్టులు, స్టార్టప్‌లతో విద్యార్థులు మెరగాలని తెలిపారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ భారత ప్రభుత్వం ఈ ఇన్స్పైర్ అవార్డులకు సంబంధించి రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులను ఎంపిక చేసింది. తమ మార్గదర్శలతో కార్యక్రమానికి హాజరైన విద్యార్థులందరికీ ఆచార్యులు బ్యాగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ సుదర్శన్ దీప, డాక్టర్ వినోత్ కుమార్ రాజా, డాక్టర్ భరణీ దరన్, డాక్టర్ జగన్ మోహనరావు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు అరికట్టాలి

ఎపి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

ఫీల్డ్ అసిస్టెంట్‌లపై రాజకీయ వేధింపులు అరికట్టి, ఉపాధి భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలని ఎపి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్‌కు, ఎపిడికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు వ్యవసాయ కార్మికులకు అందిస్తూ వారికి చట్ట ప్రకారం పని దినాలు, వేతనాలు అందించడమే కాకుండా ఎన్ని రోజులు ఎంత పని అనే వివరాలను ప్రభుత్వానికి తెలియజేస్తూ కింది స్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు అనేక ఇబ్బందులను, పని ఒత్తిడిని ఎదుర్కొంటూ పనిచేస్తున్నారని అన్నారు. ఇటు ప్రభుత్వం చెబుతున్న పనితో పాటు అటు వ్యవసాయ కార్మికులకు అందుబాటులో ఉంటూ వారికి ఉన్న సమస్యల్ని తమ పరిధిలో పరిష్కరించేందుకు అహర్నిశలు పనిచేస్తున్న, ఏళ్ల తరబడి ఏ గ్యారెంటీ లేకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పెడుతున్న ఇబ్బందులు, వేధింపులు చెప్పుకోవడానికి వీలు లేకుండా ఉంటున్నాయని అన్నారు. కాళ్ల, పాలకోడేరు మండలాల్లో ఇప్పటికే అలాంటి వేధింపులు ప్రారంభమయ్యాయని, జిల్లా అంతటా ఇబ్బందులు ఉన్నాయని, సత్వరమే ఈ సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో వెంకటేశ్వర్లు, ప్రసన్న, వెంకటలక్ష్మి, రమేష్, రామారావు ఉన్నారు.

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెంటపాడు

ఈనెల 10న సిఐటియు ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఎంఆర్ఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. మంగళవారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిఐటియు అనుబంధ సంఘాల ముఖ్యుల సమావేశం సిఐటియు మండల అధ్యక్షులు దూలం ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు ముద్రించిన సమస్యలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పెంటపాడు మండల అధ్యక్షులు దూలం ప్రసాద్, నాయకులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రయివేటీకరణ విధానాలు నిలిపివేయాలని కోరుతూ ఈనెల 10వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చామని తెలిపారు. బంకురు నాగేశ్వరరావు, పెనగంటి దుర్గా, జె.శ్యామల కుమారి పాల్గొన్నారు.

ఉండి: కార్మికుల హక్కుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను అమలు చేయొద్దని కోరుతూ దేశవ్యాప్తంగా ఈనెల 10వ తేదీన జరిగే డిమాండ్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు ధనికొండ శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి తెచ్చుకున్న కార్మికుల హక్కులు కాపాడుకునేందుకు డిమాండ్స్ డే కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో కార్మికులు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్వాడీలు, రైస్ మిల్లు కార్మికులు, బేవరేజస్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆచంట అసెంబ్లీ పరిధిలో విచ్చలవిడిగా జూదాలు!

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచంట అసెంబ్లీ పరిధిలోని పెనుమంట్ర, పోడూరు, ఆచంట, పెనుగొండ మండలాలకు చెందిన పలు గ్రామాల్లో కోడిపందేలు, పేకాట యథేచ్ఛగా సాగుతున్నాయని పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిందనే ఆనందంలో ఎక్కడికక్కడ జూదాలు, కోడి పందేలు జరుగుతున్నా సంబధిత అధికారుల నిఘా లేక పోవడం వల్ల చాలా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని కనిపెట్టి, వాటిని నివారించే చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఉండిలో కెవికె స్వర్ణోత్సవ జ్యోతి యాత్ర

ప్రజాశక్తి - ఉండి

దేశంలో రైతు శ్రేయస్సే లక్ష్యంగా కెవికె స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కెవికె స్వర్ణోత్సవ జ్యోతి యాత్రను నిర్వహించారు. ఈ జ్యోతి యాత్ర సోమవారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రానికి చేరిందని, సోమవారం, మంగళవారం ఉండిలోనే జ్యోతియాత్ర ఉంటుందని, ఇక్కడి నుంచి బుధవారం ఘంటసాల చేరుకుంటుందని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, కెవికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మందకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు పురస్కరించుకుని పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్‌లో పట్టణ అధ్యక్షులు పశల బోసు ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సనమండ ఎబినేజార్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జెండా అవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు యార్లగడ్డ రత్నరాజు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచి** వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **అసిలేటి ఆశలత,** భర్త : అసిలేటి శేషగిరి రావు, వయస్సు : 32 సం॥, నివాసం : గణిజర్ల గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్ రిజిష్ట్రరీ యిలాకా, చింతలపూడి మండలం, గణిజర్ల గ్రామంలోని గల ఇంటి నెం. 1-99రు, అసెస్మంట్ నెం. 98రు, దాఖలా 217.8చ॥గ॥=182.9చ॥మీ॥,య. 0-04$^{1/2}$ లు, ఆర్ఎస్ నెం. 224-6, పెంకుటిల్లు, **డాక్యుమెంట్ నెం.9211/2024** గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : పంచాయితీ రోడ్డు, **దక్షిణము** : బూరుగు ఆనందరావు గారి స్థలం, ఇల్లు, **పడమర** : అసిలేటి ముత్యాలు గారి స్థలం, ఇల్లు, **ఉత్తరం** : ఆర్ అండ్ బి రోడ్డు.

పలివెల గణేష్‌బాబు
అడ్వకేట్, కొత్తగూడెం, **9849246278**

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, పోడూరు మండలం, కవిటం, డోరు నెం. 5-123, నివాసి పాలా రంగారావు గారి కుమారుడు పాలా వెంకన్న అను నేను 15-6-2024 తేదీన పాలకొల్లు బస్టాండ్ నుండి మెడికల్ క్లినిక్ కు వెళ్తుండగా పాలకొల్లు మెయిన్ రోడ్డు ఏరియా నందు నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్టు పడిపోయినది. నా పాస్ పోర్ట్ నెంబర్ L1437394. నేను ఎంతవెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందజేయవలసినదిగా కోరి ప్రార్థించుచున్నాను.

పాలా వెంకన్న, S/o.రంగారావు,
H.No. 5-123, కుమ్మర్ల వారి వీధి,కవిటం,
పోడూరు మండలం, ప.గో.జిల్లా. ఫోన్. 9177191971